
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు

# - 179 -

## విమాన కష్టాల్ వస్తాయ్, పోతాయ్ కథ. – మొదటి భాగం

గత సెప్టెంబర్, 2022 లో న్యూజీలండ్ లో 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు కి మా గౌరవ ఆహ్వానితులు పడిన విమాన కష్టాలు ఇప్పుడు తల్చుకుంటే భలే నవ్వు వస్తుంది. అంతే కదా. కొన్ని కొన్ని సంఘటనలు జరుగుతున్నప్పుడు ఎంత చికాకు, భయం, ఏమవుతుందిరా బాబోయ్. అసలు దీని నుంచి బయట పడతామా, లేదా అనుకుని బీపీ. సుగరూ, కోపం, తాపం మనం పెంచేసుకుని, అందరికీ పెంచేసి  మొత్తానికి బయట పడి ఊపిరి పీల్చుకున్నాక....అదే సంఘటనని కొన్నాళ్ళ తర్వాత కథలు కథలుగా చెప్పుకున్నప్పుడు నవ్వు రావడం సహజమే. ఈ విమాన కష్టాలు అలాంటివే. ఇందులో రెండు అమెరికా, రెండు భారత దేశం వెరసి నాలుగు పాత్రలు. ఏయే పాత్ర కష్టాలు ఆ పాత్రవే. పీత కష్టాలు పీతవే! ఇదేదో సామెత బావుంది కదా అని అన్నాను కానీ ఇందులో ముగ్గురు పాత్ర ధారులు పీతల బాపతు కానే కాదు. అందరూ లబ్ధ ప్రతిష్టులైన గొప్పవాళ్ళే. ఏకైక పీతని నేనే. విషయానికొస్తే ఈ విమాన కష్టాలు పడి, ప్రయాసలకి ఓర్చుకుని, మొత్తానికి న్యూజీలండ్ చేరి, ఆ ప్రపంచ సదస్సుని విజయవంతం చేసిన ఇద్దరూ కవి జొన్నవిత్తుల గారు, సాహితీవేత్త వోలేటి పార్వతీశం గారు. వారిద్దరికీ నమో నమ: వారి ఓపికకీ, అంత క్లిష్ట సమయం లోనూ వారు పాటించిన సంయమనానికీ నిఝంగానే వేనవేల ధన్యవాదాలు. మరొకరు అయితే నన్ను చెడా, మడా తిట్టి ప్రయాణం కేన్సిల్ చేసుకుని ఇంటికి వెళ్ళిపోయే వారు. ఈ కథ ఆ నాటి సంఘటనలని సరదాగా నెమరు వేసుకోవడం మాత్రమే. యధాతధంగా జరిగినవి కాదు. నా సొంత పైత్యం కలిపి సరదా కోసం.. మీ కోసం కల్పించినవే ఈ విమాన కష్టాలు...ఎవరినైనా నొప్పిస్తే మన్నించాలి.

కథా ప్రారంభం బెట్టిదనిన..విమానం టికెట్టు కొనుట.

న్యూజీలండ్ సదస్సుకి జొరా గారినీ, వోపా ప్రధాన అతిధులుగా ఆహ్వానించాం కదా!. అప్పటికి పది రోజులకి ముందే న్యూజీలండ్ ప్రభుత్వం కోవిడ్ నిబంధనలు ఎత్తేసి, విజిటర్స్ ని రానివ్వడం మొదలు పెట్టారు. కానీ అంత తక్కువ సమయం లో వీసా ఎలాగా రాదు కదా. మనం పంపించినవి ఉత్తుత్తి ఆహ్వానాలే కదా అనుకుంటే అక్కడ న్యూజీలండ్ లో

ప్రధాన నిర్వాహకురాలు శ్రీలత మగతల తన పరపతి ఉపయోగించి సదస్సుకి సరిగ్గా వారం ముందు వీసాలు వచ్చేలా చేయడంతో అది నా ప్రాణం మీదకి వచ్చింది. ఎందుకంటే ఇప్పుడు తలతాకట్టు పెట్టి ఆ ఇద్దరికీ విమానం టికెట్లు కొనాలి కదా!. దాని కోసం మేము హైదరాబాద్ లో అధికారికంగా ఏర్పాటు చేసిన ఒకానొక గొప్ప ట్రావెల్ ఏజెంట్ ని జొరాగారూ, వోపా గారూ సంప్రదించారు. ఆ మానవుడు తనే మోడీ యో, అమిత షా యో అనేసుకుని "అయామ్ వెరీ బిజీ. మీ పాస్ పోర్ట్, వీసా ఇచ్చినట్టు ఉత్తరం, బ్యాంకు, ఆస్తి వివరాలు, మీ ఫొటోలు రెండూ, మీ తాతముత్తాతలు, మనడు, కోడలూ, అల్లుడూ వగైరా ఫొటోలు నాలుగూ, రెండు జతల బట్టలూ, కోవిడ్ కార్డూ, చెస్ట్ ఎక్స్ రే. కేసీఆర్ నుంచి తెలంగాణా నుంచి న్యూజీలాండ్ వెళ్ళడానికి పెర్మిషనూ..ఇవన్నీ తీసుకుని ఎల్లుండి రాత్రి తొమ్మిదింటికి రండి. ఆలస్యం అయితే మళ్ళీ వారం దాకా ఐ హేవ్ నో టైమ్" అని జొరా గారికి చెప్పగానే ఆయన బెంబేలు ఎత్తిపోయారు. నేను స్వయంగా ఆ ట్రావెల్ ఎజెంట్ తో మాట్లాడగానే ఎంతయినా నాది అమెరికా గొంతు కదా....ఆయన మెట్టు దిగాడు కానీ ఆ కేండిడేట్ ని ఏకి పారేసి, పీకి పారెయ్యక తప్ప లేదు. ఇక అర్జంటుగా తనకి బాగా తెలిసిన మరొక ట్రావెల్ అమ్మాయి దగ్గరకి వోపా గారితో కలిసి అన్ని కాగితాలూ పట్టుకుని జొరా గారు వెళ్ళారు...ఇక్కడ ఆట ఇంకొక రకం. ఈ అమ్మాయి బాబా భక్తురాలు ట. ఏ బాబాయో నాకు తెలీదు. ఇక ఆవిడ ఇండియాలో మధ్యాహ్నం 12 గంటలకి ..అనగా. నాకు అమెరికాలో అర్ధరాత్రి దాటాక....ఫోన్ల మీద ఫోన్లు. అందులో ఆఖరి ఫోన్ "జై సాయిరాం. టికెట్లు ఎమిరేట్స్ లో హైదరాబాద్, దుబాయ్ మీద నుంచి వూస్టనూ, హవాయీ, ఆస్ట్రేలియాలో మెల్ల బోరనూ, అక్కడ నుంచి ఆక్లండూ..ట్రావెల్ సమయం 58 గంటలు. రేపు బయలు దేరితే నాలుగు రోజుల తర్వాత సరిగా సదస్సు సమయానికి అందుకుంటారు" అని ఆ అమ్మాయి గడ గడా అనగానే నేను అప్రయత్నంగా "అప్పటికి బతికే ఉంటారా?" అనేశాను. "జై సాయిరాం...ఉంటారు సార్. ఫ్లైట్ లో స్పెషల్ వెజిటేరియన్ ఫుడ్ ఆర్డర్ పెడతాను. మరి. రెండే రెండు టికెట్లు ఉన్నాయి సార్. ఒక్కొక్కటే నాలుగు లక్షల డభై ఐదు వేలు ప్లస్ టేక్స్...ఏ కార్డ్ ఇస్తారు వీసయ్యా, మాస్టరయ్యా. జై సాయిరాం ."...ఇదంతా ఆ అమ్మాయి నాకు చెప్తున్నప్పుడు ఎదురుగుండా కూచున్న జొరా, వోపా ల హావభావాలు ఎలా ఉండి ఉంటాయో మా క్వీన్ విక్టోరియా ని అడగాలి. నేను అప్పటికి 15 రోజుల ముందు ఆహ్వానం పంపించినప్పుడు అదే టికెట్ ఖరీదు కేవలం 75 వేల రూపాయలు.

దాం దుంపదెగా...నా బుర్ర ఉంది చూశారా...అంత రాత్రి ఒంటి గంట సమయంలోనూ ఇప్పటి ఆ టికెట్ ఖరీదు వినగానే అది పాదరసంలా పని చేసి "ఒరేయ్..జస్ట్.... పది వేల డాలర్లు మాత్రమే భడవాయ్. దమ్ముంటే ఆవిడకి చెప్పు" అని నాకు టెంకి జెల్ల కొట్టింది...అవును క్వీన్ విక్టోరియాదే. అదే దెబ్బ. ఇక నా గుండె కొట్టుకోడం ఆగుదామా, కంటిన్యూ చేద్దామా అని ఆలోచనలో పడింది. ఆ ట్రావెల్ అమ్మాయి తో "ఆగాగు, ఏమంటివి, ఏమంటివి?" ప్రయాణము దగ్గర పడినందువలన ఒక్కొక్క టిక్కెట్టూ ఐదు లక్షలందువా? అని ఎన్టీఆర్ ఫక్కీలో అనేసి "ఆన్ లైన్ లో కాయక్, ఆర్బిట్జ్,

ట్రావెలాసిటీ, .ఇలా చాలా ఉన్నాయి కదా...అవేమైనా చూశావా? అని అడిగాను. "జై సాయిరాం. ఆ పోర్టల్స్ మాకు ఓపెన్ అవవు సార్. మేము ఏజెంట్లం కదా." అనగానే "అటులనా?'" అని సాలోచనగా బుర్ర గోక్కుని "ఒక గంట ఆగి ఫోన్ చేస్తాలే" అని చెప్పి ...రాత్రి రెండు గంటలకి హైదరాబాద్ నుంచి ఆక్లండ్ కి విమానం టికెట్లు ఆన్ లైన్ లో వెతకడం మొదలు పెట్టాను...అంటే విజృంభించాను అనే చెప్పుకోవాలి. న్యూజీలండ్, ఆస్ట్రేలియా, మలేషియా, సింగపూర్..ఇలా ఆ ప్రాంతాల అన్ని దేశాల విమానం కంపెనీలు, కాయక్, ఫ్లైస్ లైన్, ట్రివాగో, ట్రావెలాసిటీ..ఇలా ఆన్-లైన్ ట్రావెల్ ఏజెంట్ల నుంచీ "అతి తక్కువ సమయంలో అతి తక్కువ గూబ వాయింపు" కోసం విసుగెత్తని విక్రమార్కుడిలా ప్రయత్నం చెయ్యగా....మొత్తానికి ఒక్కొక్కటీ రెండున్నర లక్షలకి జొరా గారికీ, వేపా గారికీ విమానం టికెట్లు కొనడం పూర్తి అయింది. అప్పటికి ఐదు లక్షలకి తెల్లారింది.

ఇక్కడొచ్చిన చిన్న తిరకాసు ఒక్కటే. ఆ ఇద్దరికీ ఒకే విమానంలో టికెట్టు దొరక లేదు. ఒకాయనకి ఎయిర్ న్యూజీలండ్ లో హైదరాబాద్ నుంచి బెంగళూరు దాకా స్థానిక ఇండిగో యో మరొకటో స్థానిక భారత విమానం, అక్కడ నుంచి ఎయిర్ న్యూజీలండ్ లో సిడ్నీ, ఆస్ట్రేలియాలో విమానం మారి అక్కడ నుంచి ఆక్లండ్, న్యూజీలండ్ కి టికెట్ దొరికింది. సుమారు 20 గంటలు ప్రయాణం. రెండో ఆయనకి సింగపూర్ విమానంలో హైదరాబాద్ నుంచి సింగపూర్, అక్కడ నుంచి ఆక్లండ్ ...సుమారు 24 గంటలు ప్రయాణం. జొరా గారు సాయంత్రం, అదే రాత్రి 11 గంటల ప్రాంతాలకి వేపా గారు విమానం ఎక్కుతారు.

బావుంది కదా. అలా అప్పుడు అనిపించింది కానీ...ముందుంది ముసళ్ళ పండుగ!.

ఇక్కడో నాకున్న ఒక అలవాటు గురించి చెప్పాలి. అది మంచి అలవాటో కాదో తెలియదు కానీ అదేదో వ్యసనం అనేసుకుని నా గాఢ మిత్రులూ, గూఢ శత్రువులలాగా సంబరపడకండి....అదేమిటంటే.....రాత్రి నిద్రపోయే సమయంలో ఎక్కడో పగలు మాత్రమే మేము 'నివశించే గది'...అనగా లివింగ్ రూమ్ లో నా సెల్ ఫోన్ పెట్టి..అది మోగినా, వాగినా, కుయ్యో, మొర్రో అని అరిచి గీపెట్టినా రాత్రి 'మేష్టారు పడుకునే గది'...అదే..మాస్టర్ బెడ్ రూమ్ లో అస్సలు వినపడకుండా జాగ్రత్త పడతాను. కనీసం రాత్రి 2 దాటాక కొన్ని గంటలు అయినా "నా బాధ ప్రపంచానిదీ, ప్రపంచం బాధ నాదీ" అనే బాధ నుంచి తప్పించుకోవడమే నా ఉద్దేశ్యం. "ఏదైనా ఎమర్జెన్సీ వస్తేనో?" అని అడకకండి. అందుకే అది మంచి అలవాటో, కాదో నాకు తెలీదు. ఆ మాటకొస్తే మీకూ తెలీదు. ఇంతకీ ఈ గాడిద గుడ్డు అలవాటుకీ ఈ విమాన కష్టాలకీ లంకె ఏమిటో.....మరొక సారి...రెండో భాగం లో...

**COMMENTS**